# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

# కాంచనమాల

## (తెలుగు సినిమా 1948, ఏప్రిల్ సంచిక నుంచీ)



శివలింగ ప్రసాద్, కాంచనమాల

తెనాలి సమీపంలో కూచిపూడి అనే గ్రామంలో నివసించే దాసరి నారాయణదాసు కుమార్తె కాంచనమాల. పినతండ్రి వీరాస్వామి ఇంట్లో పెరిగింది కొంతకాలం. వీరాస్వామి సంఘసంస్కర్త, వైలనిస్టు. ఈయన ఇంట్లో పెరిగిన కాలంలోనే కాంచనమాలకి కొంత సంగీతం, విజ్ఞానం అబ్బింది. ఆమెకి పదమూడు ఏళ్ళున్నప్పుడు, సినిమాలలో చేరాలని బుద్ధిపుట్టింది. కాని, అప్పట్లో ఖ్యాతి గడించిన ఒక దర్శకుడు, కాంచనమాల ముఖం స్క్రీనుకి పనికిరాదన్నాడు.

ఆ తర్వాత కొంతకాలానికి కపిలవాయి రామనాథశాస్త్రి, ఋష్యేంద్రమణి నటించిన 'కృష్ణ తులాభారం' లో యీమెకి అవకాశం లభించింది. అప్పటికే గాలి వెంకయ్యతో కాపురం చేస్తూండేది. కృష్ణ తులాభారంలో కాంచనమాల నటించిన పాత్ర మరీ చిన్నదవటం వల్ల, పైగా యీ చిత్రం విజయవంతం కాకపోవటం వల్ల, కాంచనమాలకి పేరు రాలేదు.

తెనాలి వారు 'వీరాభిమన్యు' కి ఆర్టిస్టులని అందచేసే కాంట్రాక్టు తీసుకోవటం వల్ల యీమెకి వీరాభిమన్యులో అవకాశం లభించింది. వీరాభిమన్యుకోసం తీసిన టెస్టుషాట్సు చూసి, ప్రఖ్యాత స్త్రీ నిర్మాత బాయిజదన్ బాయి ముగ్ధురాలయిందనీ, ప్రఖ్యాత హిందీ చిత్రాలలో వేయిస్తానని అడగ్గా అందుకు కాంచనమాల అంగీకరించలేదనీ తెలుస్తున్నది. ఆ తర్వాత విప్రనారాయణలో నటించింది. విప్రనారాయణలో యీమె నటన చూసి, కీ.శే.గూడవల్లి రామబ్రహ్మం గారు "యిప్పటికి తెలుగు

సినిమాలకి ఒక తార వచ్చింది" అని ప్రజామిత్రలో వ్రాశారు. గృహలక్ష్మి తర్వాత కాంచనమాల తారాపథాన్ని చేరుకుంది. మాలపిల్ల, వందేమాతరం, మళ్ళీ పెళ్ళి, యిల్లాలు, మైరావణలలో నటించింది. 1941 ప్రాంతాలకి, కాంచనమాలకి ఒక్క తెలుగు సినిమా పరిశ్రమలోనే కాక, దక్షిణదేశ సినిమా పరిశ్రమ అంతటిలోనూ ఒక పెద్ద విలువ ఏర్పడింది.

జెమినీ స్టూడియోస్ ప్రారంభించి, దక్షిణదేశ సినిమా పరిశ్రమ అంతటినీ అరచేతుల్లో బిగిద్దామని వుద్దేశించి, ఆనాటి ప్రఖ్యాత తారలనీ, టెక్నీషియన్లని బుక్ చేయ ప్రారంభించాడు వాసన్.

జెమినీ వారి నాలుగు చిత్రాలలో నటించటానికి బుక్ చేశాడు కాంచనమాలని వాసన్. ఆర్థికంగా, సాంఘికంగా, మనిషి స్థితి పెరిగినపుడు, ఆ పరిణామంలో కాకపోయినా, కనీసం కొంతయినా విజ్ఞానమూ, సంస్కారమూ పెరిగితే కాని తట్టుకోవటం కష్టం. అలాకాని సందర్భంలో మానసిక వైపరీత్యాలు కలగటం సహజం.

తెలుగు దేశంలో వుత్తమ నటీమణిగా పూజింపబడిన కాంచనమాలకి అహంకారం కలిగింది. అంతే కాకుండా ప్రతి మనిషినీ_ప్రతివ్యక్తినీ శంకించటం ప్రారంభించింది. ఇవన్నీ మానసిక వైపరీత్యాలే. సామాన్య మనిషి స్వభావానికి యీమె స్వభావానికీ యిదే వ్యత్యాసం. ఈ వ్యత్యాసాన్నే పిచ్చి అంటారు.

బాలనాగమ్మలో నటించేటప్పుడే కాంచనమాల మతి కొంచెం అస్థిరంగా వుండేది. లక్షణాలు పైన చెప్పాను. దీనికి తోడు దేహ అనారోగ్యం. కాని అప్పట్లో యీమె మతి స్థిరంగా లేదని ఎవ్వరూ అనుకోలేదు. గీర్వాణం అన్నారు. చీటికి మాటికి కయ్యిమనటం ప్రారంభించింది. జెమినీలో పనిచేసే వుద్యోగులకి యిది భరించటం కష్టంగా వుండేది. వైషమ్యం పెరిగింది.

ఒకసారి పోట్లాట శృతి మించింది. వాసన్ వచ్చి తీర్పు చెప్పబోయాడు. కాంచనమాల వాసన్నీ తిట్టింది.

మేకప్ తీయించమన్నాడు. నష్టపరిహారంగా లక్షరూపాయలకి పైన యిచ్చుకోమని, వాసన్ రిజిష్టర్ నోటీసు యిచ్చాడు. వాసన్ రిజిష్టర్ నోటీసుకు కాంచనమాల బెదిరిపోయింది. రాజీకి సిద్ధమైంది. అప్పటికి జెమినీ నుంచి కాంచనమాలకి 22.5 వేల రూపాయలు ముట్టాయి. బాలనాగమ్మ పూర్తి చేసేటట్టుగా, ఆ తర్వాత, నెలకి 500 రూ. అలవెన్సుతో మరొక చిత్రంలో నటించేట్టుగా రాజీ కుదిరింది.

రాజీ కాగితాలమీద సంతకం పెట్టటానికయితే అంగీకరించింది కాని, మళ్ళీ జెమినీ స్టూడియోస్ లో అడుగుపెట్టడానికి సిద్ధపడలేదు. కాంచనమాల. ఆత్మాభిమానం అందుకు కారణం. ఈ ఆత్మాభిమానమే అతిగా వుండటం యీమె మానసిక చాంచల్యానికి కారణం.

తెనాలికి వెళ్ళి తలుపులు మూసుకుంది. ఎవ్వరితోనూ, మాట్లాడదు. ఎక్కడికీ వెళ్ళదు. వాసన్ రాజీ, సినిమాలు అన్నీ మరిచిపోవ ప్రయత్నించింది. దీన్ని ఎస్కేపిజమ్ అంటారు. ఆ తర్వాత ఆరు నెలలకి ఆమె భర్త గాలి వెంకయ్య మరణించటం జరిగింది. అసలే కష్టాల్లో చిక్కుకున్న కాంచనమాల మనస్సు వెంకయ్య మరణంతో దద్దరిల్లింది.

మరికొంత చలించింది. కాంచనమాలకి పట్టిన పిచ్చి భయంకరమైంది కాదు. ఒకరికి హానిచేసే పిచ్చీ కాదు. నవ్వుతుంది. కిలకిల నవ్వుతుంది. ఎవరన్నా పలకరిస్తే పలకదు. పలికితే సరయిన జవాబు యివ్వకపోవచ్చు. రిక్షాలు జట్కాలు ఎక్కి తిరుగుతుంది. ఇవే ఆమె పిచ్చి లక్షణాలు. ఈ లక్షణాలు కూడా ఎప్పుడు వుండేవి కావు. ఎప్పుడో ఒకప్పుడు కనుపిస్తాయి. తతిమ్మా సమయాలలో స్థిరంగానే వుంటుంది.

తెనాలిలో సత్యనారాయణ టాకీసు నిర్వహిస్తున్న శివలింగప్రసాద్ వుంటున్న వీధిలోనే కాంచనమాల నివసిస్తూండేది. ప్రసాద్ కి కాంచనమాల మీద కల అభిమాన గౌరవాలవల్ల_వెంకయ్య మరణానంతరం దాదాపు రెండు సంవత్సరాలు మగదిక్కు లేకపోవటం వల్ల, కాంచనమాల మతికొంత స్థిమిత పడటం వల్ల, కాంచనమాల, ప్రసాద్ లకు బాంధవ్యం ఏర్పడింది.

మళ్ళీ సినిమా పరిశ్రమలో అడుగుపెడితే మిగిలివున్న కాస్త మతి చాంచల్యం పోతుందని, 1946 లో ప్రసాద్ కాంచనమాలని మద్రాసుకి తీసుకొచ్చాడు. స్టార్ కంబైన్సు, ఫేమస్ ఫిలింస్ వారు కలిసి 'ఆడజన్మ' తీద్దామనుకున్నారు. కొన్ని ఆటంకాలవల్ల ఆ ప్రయత్నం ఫలించలేదు.

ఆమెకి సినిమాలలో నటించాలని యీనాడు ఎంతో వుత్సాహం వుంది. కెమెరా ముందు నిలబడగానే ఆమె ప్రవర్తనలో ఎంతో మార్పు వస్తుంది. ఆమె భర్త ప్రసాదే స్వయంగా కాంచనమాలతో చిత్రం తీయటానికి సన్నాహాలు జరుపుతున్నారు.

కనీసం 1949 లోనన్నా కాంచనమాలని మళ్ళీ తెరపై చూడటానికి సినిమా ప్రేక్షకులకి అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నాను. .

★★★

## వచ్చేనెల మరో ఫ్లాష్ బ్యాక్

COMMENTS